కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో..) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 25, దొండ 35, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 35, దోసకాయ 18, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 23, కందగడ్డ 95, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సాయి వర్ధన్ విజయం స్ఫూర్తిదాయకం



సాయివర్ధన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌కు చెందిన సాయివర్ధన్ బిహార్‌లో జరిగిన ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణపతకం సాధించడం యువతకు స్ఫూర్తిదాయకం అని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. సాయి వర్ధన్ 89 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. దీంతో గురువారం సాయివర్ధన్ తండ్రి, కోచ్ శివ కుమార్‌తో పాటు ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయివర్ధన్‌ను ఘనంగా సన్మానించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున సాయివర్ధన్‌కు తగిన సహకారం అందేలా చూస్తానన్నారు. 17 ఏళ్ల వయసులోనే అసమాన ప్రతిభ కనబరిచిన సాయి వర్ధన్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

రక్తదాన శిబిరం



సనత్‌నగర్: ఏఐసీసీ సభ్యురాలు, కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో శిబిరం జరిగింది. దాదాపు 25 మంది యువకులు రక్తదానం చేశారు.

మహంకాళి దేవాలయంలో మంత్రి పూజలు



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి సతీమణి మంజుల జన్మదినం పురస్కరించుకొని ఆలయ ఈవో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ గుత్త మనోహర్‌రెడ్డి, ఫ్యామిలీ మెంబర్ కామేశ్వర్, నాయకులు మహేష్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.86వేలు మాయం చేసిన సైబర్ నేరగాళ్లు

సనత్‌నగర్: ఇంట్లో పాడైన టీవీ మరమ్మతు కోసం గూగుల్ శోధించిన ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. రూ.9 పంపమని చెప్పి అతని ఖాతాలోని రూ.86 వేలు మాయం చేశారు. పోలీసులు తెలిపిన మేరకు..బేగంపేట ప్రకాష్‌నగర్‌కు చెందిన రామారావు ఇంట్లోని సోనీ టీవీ పాడవ్వడంతో మరమ్మతు సేవల కోసం గూగుల్‌లో శోధించాడు. గూగుల్‌లో కనిపించిన ఓ నెంబర్‌కు ఫోన్ చేశాడు. వివరాలు అడిగిన అవతలి వ్యక్తి రూ.9 పంపమని చెప్పడంతో అతని చెప్పిన నెంబర్‌కు రూ.9 పంపాడు. దీంతో వెంటనే రామారావు బ్యాంక్ ఖాతా నుంచి రూ.86 వేలు గల్లంతయ్యాయి. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీఐ కమిషనర్ల నియామకంలో బీసీలకు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: సమాచార కమిషనర్ల నియాకమంలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 56 శాతం జనాభా ఉన్న బీసీలలో రాష్ట్ర సమాచార కమిషనర్లకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత గల ఒక్క అభ్యర్థి కూడా లేరా ? అని ప్రశ్నించారు. నియామకాల్లో బీసీలు ఒక్కరు కూడా లేకపోవడం దారుణమన్నారు.

పాఠశాలల పునః ప్రారంభం నాటికే పుస్తకాలు

ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ అధికారులు



సనత్‌నగర్: పాఠశాలల పునః ప్రారంభం నాటికి సర్కారీ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందించిన ఇండెంట్ ఆధారంగా ఇప్పటికే ద్విభాషా పాఠ్య పుస్తకాలు గోడౌన్లకు చేరుకున్నాయి. విద్యాశాఖ సికింద్రాబాద్ జోన్ పరిధిలో మొత్తం 15 ఉన్నత పాఠశాలలు, 34 ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయి. సికింద్రాబాద్ మండలం–1 పరిధిలో 6 ఉన్నత, 10 ప్రైమరీ పాఠశాలలు, మండలం–2 పరిధిలో 9 ఉన్నత, 24 ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయి. సనత్‌నగర్ నియోజకవర్గం ప్రధానంగా సికింద్రాబాద్ మండలం–1, మండలం–2, అమీర్‌పేట మండలం, బాలానగర్ మండల పరిధుల్లో విస్తరించి ఉంది. సికింద్రాబాద్ మండలం 1, 2 పరిధి కిందికి వచ్చే బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట, మోండా, కంటోన్మెంట్ నియోజకవర్గంలోని రసూల్‌పురా తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇప్పటికే పాఠ్య పుస్తకాలకు సంబంధించిన ఇండెంట్‌ను ఉన్నతాధికారులకు పంపించారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలో 15 వేల పైచిలుకు విద్యార్థులు చదువుతున్నారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ మీడియంలకు సంబంధించి అన్ని సబ్జెక్టుల పుస్తకాల ఇండెంట్ ప్రకారం గోడౌన్ల నుంచి పుస్తకాలను సరఫరా చేస్తున్నారు. అన్ని మీడియంకు చెందిన 1–10 వ తరగతి విద్యార్థులకు అన్ని సబ్జెక్టులను కలుపుకుని సికింద్రాబాద్–1కు 47,223 పాఠ్య పుస్తకాలు, అలాగే సికింద్రాబాద్–2కు 30,519 పుస్తకాల ఇండెంట్ ప్రధానోపాధ్యాయుల నుంచి వచ్చింది. ఇక విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే అమీర్‌పేట మండలంలో 3 ఉన్నత, 5 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సైతం ఏ తరగతికి ఎన్ని పుస్తకాలు అవసరమో గుర్తించి ఇండెంట్‌ను పంపించారు. ఆ మేరకు పుస్తకాల పంపిణీకి అధికారులు సిద్ధమయ్యారు. కొత్తగా చేరుతున్న వారిని కలుపుకుని వచ్చే నెల 12 పాఠశాల పునః ప్రారంభం రోజున పంపిణీ చేయనున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ విద్యా సంవత్సరంలో ప్రణాళిక ప్రకారం ముందే ముద్రణకు శ్రీకారం చుట్టి మే నెలలోనే గోడౌన్ల నుంచి పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేస్తుండడం వల్ల విద్యార్థుల హాజరు శాతం పెరగడమే కాకుండా కొత్త విద్యార్థుల నమోదు కూడా పెరుగుతుందని టీచర్లు భావిస్తున్నారు.

పుస్తకాల పంపిణీతోనే పాఠశాలల ప్రారంభం

ఇప్పటికే అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమర్పించిన ఇండెంట్ ఆధారంగా గోడౌన్ల నుంచి పుస్తకాల పంపిణీ ప్రారంభించడం జరిగింది. విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలు అందించాలన్నదే తమ లక్ష్యం. ఆ దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి.

\- సికింద్రాబాద్ డిప్యూటీ డీఈఓ శ్రీధర్..

కమ్యూనిటీ హాల్‌ను పునర్ నిర్మించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సింగాడ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం:10లోని సింగాడ బస్తీలో కమ్యూనిటీ హాల్‌ను పునర్‌నిర్మించాలని బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కోరారు. ఈ మేరకు ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా ఈ కమ్యూనిటీ హాల్ సమస్య పెండింగ్‌లో ఉందని ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి నూతన కమ్యూనిటీ హాల్ కోసం ప్రతిపాదనలు రూపొందించి నిధులు మంజూరు చేయించి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సింగాడబస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జవ్వాది అనిల్‌కుమార్, సతీష్‌కుమార్, మూర్తి, గంగరాజు, సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

ఈటలపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న గుర్రాల మల్లేశం ముదిరాజ్

పంజగుట్ట: మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ డిమాండ్ చేసింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, రాష్ట్ర యువత అధ్యక్షుడు పండుగ బాలు ముదిరాజ్ మాట్లాడుతూ..ఈటల రాజేందర్ తల్లి, తండ్రి ఇద్దరూ ముదిరాజ్ అయితే ఈటల ముదిరాజ్ కాదా అని ప్రశ్నించారు. గౌడ కులానికి చెందిన బీసీ బిడ్డ పీసీసీ అధ్యక్షుడు అయితే ఎంతో సంతోషించామని, కానీ బీసీ బిడ్డ ఈటలపై ఇలా అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. సమావేశంలో రాజ్‌కుమార్, పోలు లక్ష్మణ్, చొప్పరి సోమయ్య, గుడెల్లి తిరుపతి, పొన్నం మొగిలి, రజినీకాంత్, సదయ్య, ప్రశాంత్, సురేష్ పాల్గొన్నారు.

సింగరేణిలో జరిగిన కుంభకోణాలపై దర్యాప్తు చేయాలి

పంజగుట్ట: బీఆర్‌ఎస్ పాలనలో సింగరేణిలో జరిగిన కుంభకోణాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని వివిధ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గొల్లపల్లి దయానంద రావు, ప్రజా సంఘాల మేధావుల విభాగం కార్యదర్శి నందికంటి సాయికుమార్, తెలంగాణ సమరయోధుల వేదిక ప్రతినిధి గంటా సత్యనారాయణ రెడ్డి మాట్లాడారు. సింగరేణిలో గత ప్రభుత్వంలో అనేక కుంభకోణాలు జరిగాయని, గత ప్రభుత్వ హయాంలో గల అధికారులే ప్రస్తుతం కొనసాగుతుండడంతో వారు కోవర్టులుగా మారి సింగరేణిని రక్షించాల్సింది పోయి భక్షిస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో డిజిల్ కుంభకోణం, శ్రీరాంపూర్, సత్తుపలి, బొగ్గు కుంభకోణంలో డి గ్రేడ్ బదులు బి గ్రేడ్ బొగ్గు సరఫరా చేసి సంస్థకు నష్టం వాటిల్లిలా చేశారన్నారు. ముఖ్యమంత్రి స్పందించి సింగరేణిపై ప్రత్యేక శ్రద్ధ చూపించి దాన్ని కాపాడాలని సూచించారు. సమావేశంలో పోకల కిరణ్ కుమార్, మహేశ్వర రాజు పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లో అర్ధరాత్రి కారు బీభత్సం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లో బుధవారం అర్ధరాత్రి అదుపుతప్పిన వేగంతో దూసుకెళ్తున్న ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన కె.అనిరుధ్ అనే విద్యార్థి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో అనిరుథ్ రోడ్డునెంబర్–12 నుంచి విరించి ఆస్పత్రి వైపు ఐ20 కారులో దూసుకెళ్తున్నాడు. పిజ్జా హట్ వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు దెబ్బతినగా, అనిరుథ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కిమ్స్‌లో గామా నైఫ్ సెంటర్

కిమ్స్ ఆస్పత్రిలో అత్యాధునిక గామా నైఫ్ సెంటర్ అందుబాటులోకి వచ్చింది. ఆధునిక చికిత్సతో రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఇది దోహం చేస్తుందని కిమ్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు తెలిపారు. - సికింద్రాబాద్

నేటి నుంచి అండర్–14 క్రికెట్ టోర్నమెంట్

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ గాంధీనగర్ శ్రీనివాస ప్లేగ్రౌండ్‌లో సీవి చారిటబుల్ ట్రస్ట్, గాంధీనగర్ కార్పొరేటర్ పావని సంయుక్త ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ పోటీలు ఈనెల 16 నుంచి ప్రారంభమవుతాయని సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్ అండర్–14 పోటీలను ఉదయం 10గంటలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

రేపు 'తిరంగా ర్యాలీ'

నల్లకుంట: పహల్గాం ఉగ్రమూకల దాడి అనంతరం పాకిస్తాన్ ముష్కర మూకల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో ఈనెల 17న సైనికుల గౌరవార్థం 'తిరంగా ర్యాలీ'చేపడుతున్నామని శబరిమల అయ్యప్ప సేవా సమాజం (ఎస్ఏఎస్ఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి నాయిని బుచ్చిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. భారత వీర సైనికుల శక్తి సామర్థ్యాలను మననం చేసుకుంటూ ఆ రోజు సాయంత్రం 5గంటలకు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఈ ర్యాలీ ప్రారంభమవుతుందని అన్నారు.

నేడు సంకటహర చతుర్థి

సనత్‌నగర్: సంకటహర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ శ్రీ హనుమాన్ దేవాలయం (సెవెన్ టెంపుల్స్) ప్రాంగణంలోని శ్రీ గణపతి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృతాభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయని పేర్కొన్నారు.

ఓపెన్‌జిమ్ పనులు ప్రారంభం



ఓపెన్ జిమ్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్

బొల్లారం: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆధ్వర్యంలో వార్డు 7 గన్ రాక్ కాలనీలో ఓపెన్ జిమ్ పనులను ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ ప్రభుత్వం అభివృది, సంక్షేమం మాత్రమే కాక ప్రజల ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మురళి ముదిరాజ్, నాగినేని సరిత పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి బీయూ 4 ఎలక్ట్రిక్ వాహనాలు



బీయూ4 ఎలక్ట్రిక్ వాహనాలను మార్కెట్లోకి లాంచ్ చేస్తున్న దృశ్యం

రసూల్‌పురా: అతి తక్కువ ఖర్చుతో ఎంవీ ఆటోమొబైల్స్ భాగస్వామ్యంతో బీయూ 4 ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి వచ్చాయని బీయూ 4 ఆటో ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ, చైర్మన్ ఉర్విష్ షా తెలిపారు. గురువారం కార్ఖానాలో బీయూ4 ప్రత్యేక డీలర్‌షిప్, అవుట్‌లెట్‌ను ఆయన ప్రారంభించారు. విద్యుత్ ద్విచక్ర వాహనాలకు డిమాండ్‌కు అనుగుణంగా బీయూ4 ఎలక్ట్రికల్ వాహనాల్లో స్టార్, షైన్, డోడో అనే మూడు మోడల్స్‌తో పాటు హైస్పీడ్ శ్రేణిలో పీయోనీక్స్ మోడల్స్ ఉన్నాయన్నారు.ఈ వాహనాలను యాప్ ద్వారా మానిటరింగ్ చేయవచ్చన్నారు.

పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలి



పేదలకు చెక్కులను పంపిణీ చేస్తున్న కోట నీలిమ

రాంగోపాల్‌పేట్: పేద ప్రజలను ఆదుకునేందుకు అందరూ ముందుకు రావాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అన్నారు. గురువారం కోట నీలిమ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు త్రికాల మనోజ్, హేమంత్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు విరాళంగా ఇచ్చిన చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేదలను ఆదుకునేందుకు రావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈందర్భంగా ఆమె ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



తుకారాంగేట్‌లో సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

అడ్డగుట్ట: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని సికింద్రాబాద్ జోన్ సీఐటీయూ నాయకులు అన్నారు. ఈ మేరకు మే 20న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ తుకారంగేట్ లేబర్ అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జోన్ నాయకుడు గోపాల్ మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజేపీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిచడం సరైంది కాదన్నారు. కార్మిక వర్గ పోరాటాల ద్వారా 100 సంవత్సరాలలో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందన్నారు. వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దేవయ్య, రవి, దానయ్య, సాయిలు, మల్లేష్, రమేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ 327 యూనియన్‌లో పలువురి చేరిక



ఐఎన్‌టీయూసీ 327 యూనియన్‌లో చేరుతున్న విద్యుత్ శాఖ సిబ్బంది

అడ్డగుట్ట: ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ టీజీఎస్పీడీసీఎల్ 327 యూనియన్‌లో చేరికలు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల టీజీఎస్పీడీసీఎల్ సికింద్రాబాద్ సర్కిల్ ప్యారడైజ్ డివిజన్ 1104 యూనియన్‌కు చెందిన 9 మంది చేరగా, గురువారం మరి కొంద మంది సభ్యులు ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ టీజీఎస్పీడీసీఎల్ 327 యూనియన్‌లో చేరారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తులసీదాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్‌ల సమక్షంలో 1104 యూనియన్‌కు చెందిన 12 మంది(లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్లు, ఓఎస్, జూనియర్ లైన్‌మెన్లు, ఆర్టిసెన్లు) సభ్యులు చేరినట్లు తెలిపారు. ఈ మేరకు వారిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. లైన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖరం, లైన్‌మెన్లు సీహెచ్. వెంకటేష్, నర్సింగ్, రవీందర్, సతీష్‌రెడ్డి, ఆఫీస్ సబ్‌ఆర్డినేట్ జుబేదా బేగం, జూనియర్ లైన్‌మెన్లు కార్తీక్, సూరజ్‌కుమార్ తదితరులు చేరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ కె. హేమలత



సీసీ నగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ కె. హేమలత

బన్సీలాల్‌పేట్: ప్రజాభివృద్ధి కార్యక్రమాల ద్వారా డివిజన్ సమగ్రాభివృద్ధికి నిర్మాణాత్మకమైన కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ కె. హేమలత అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కె. హేమలత మాట్లాడుతూ డివిజన్‌లో ప్రజలెదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటనలు సాగిస్తూ ప్రజలు సూచించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. చాచానెహ్రూనగర్‌లో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సదుపాయాల కల్పనకు అనేక చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, విజయ్‌పాల్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

బొల్లారం: కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే శ్రీ గణేష్ పేర్కొన్నారు. వార్డు 8 పరిధిలోని కలాసిగూడలో కంటోన్మెంట్ హాస్పిటల్ నుండి ప్రభుత్వ టాయిలెట్ కాంప్లెక్స్ వరకు రూ.32 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్ శంకుస్థాపన చేశారు.నియోజకవర్గ అభివృద్ధికి సీఎం అవసరమైన నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మాజీ వైస్ ప్రెసిడెంట్ జయప్రకాష్, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామ్ , యువజన కాంగ్రెస్ నాయకులు అరవింద్ పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

రాంగోపాల్‌పేట్: గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న ఓ వ్యభిచార గృహంపై ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్, గోపాలపురం పోలీసులు దాడి చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుదీంద్ర తెలిపిన మేరకు.. థానేకు చెందిన బీమల్‌సేన్ అలియాస్ సుబ్రతా కోలే (36), బంగ్లాదేశ్‌కు చెందిన షేక్ హొస్సైన్ అలియాస్ ముల్లా (29)లు ఇద్దరూ కలిసి రెజిమెంటల్‌బజార్‌లో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, గోపాలపురం పోలీసులు దాడి చేయగా నాసిర్ అలీ అనే కస్టమర్‌తో పాటు ఇద్దరు నిందితులు పట్టుబడ్డారు. పాండిచ్చేరికి చెందిన నిర్వాహకులు, శిఖ, బాబు, అమీర్‌పేట్‌కు చెందిన శివలు పరారీలో ఉన్నారు. ఇద్దరు యువతులను హోంకు తరలించారు.

సత్ఫలితాలిస్తున్న వరదనీటి సంప్‌లు

ఆర్టీఏ కార్యాలయం ఆవరణలో భారీ సంప్ నిర్మాణం

బంజారాహిల్స్: భారీ వర్షాలు కురిసినప్పుడు రోడ్లపై వరదనీరు నిలవకుండా నిర్మించిన రెయిన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్లు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. మొదటి ఫేజ్ కింద జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాల్లో హోల్డింగ్ స్ట్రక్చర్ నిర్మాణం పూర్తి చేసుకోగా, రాజ్‌భవన్ రోడ్డులోని లేక్‌వ్యూ గెస్ట్ హౌస్‌తో పాటు సోమాజీగూడ ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం ముందు మెర్క్యూరీ హోటల్ చౌరస్తాలో, సచివాలయం సమీపంలో వీటి నిర్మాణాలు పూర్తి చేశారు. ఈ క్రమంలోనే గత మార్చి 3వ తేదీ నుంచి ఇప్పటివరకు పలుమార్లు కురిసిన భారీ వర్షాలకు గతంలో ఉన్నంత వరద తీవ్రత కనిపించడం లేదు. గత మార్చి 3న మూడు గంటల్లోనే 9 సెంటీమీటర్ల వర్షం కురవగా, లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ ముందు రెండు చోట్ల నిర్మించిన వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్ వద్ద వరదనీరు ఎప్పటికప్పుడు సంప్‌ల్లోకి చేరుకుంది. రాజ్‌భవన్ రోడ్డులో గతంలో 5 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షం కురిస్తే ట్రాఫిక్ స్తంభించిపోయి రాకపోకలు నిలిచిపోయేవి. కానీ మార్చి 3న 9 సెంటీమీటర్ల వర్షంపాతం దాటినా పెద్దగా ఇబ్బంది కలగలేదు.

ఆర్టీఏ ఆవరణలో మరో సంప్ నిర్మాణం..

- ఈ వరదనీటి సంప్‌ల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని ఖైరతాబాద్ సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి వెల్లడించారు.
- ఈ హోల్డింగ్ స్ట్రక్చర్లను 10 లక్షల లీటర్ల నీటిని స్టోర్ చేసుకునేలా నిర్మించారు. భారీ వరదలకు 10 లక్షల లీటర్ల నీటిని ఈ సంప్‌లు తీసుకోగలుగుతున్నాయి.
- ఒకవేళ వీటిని నిర్మించకుంటే వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగి ఉండేవి. ఖైరతాబాద్ ఆర్టీఏ ఆఫీసు వద్ద కూడా చిన్నపాటి వర్షానికి నడుము లోతు నీరు నిలిచిపోయేది.
- ఇక్కడ కూడా భారీ సంప్ నిర్మాణంతో సమస్య పరిష్కారమైంది. ఇప్పుడు వీటికి అదనంగా ఆర్టీఏ కార్యాలయం ఆవరణలో కూడా 10 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం ఉండే సంప్‌ను నిర్మిస్తున్నారు.
- మెర్క్యూరీ హోటల్ ముందు నిర్మించిన సంప్‌లో వరదనీరు నిలవగానే నేరుగా ఆర్టీఏ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న సంప్‌లోకి మళ్లిస్తారు. దీంతో ఒక్క చుక్క కూడా నీరు నిలవకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.
- రెయిన్‌వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్‌లో సుమారు 10 లక్షల లీటర్ల నీరు స్టోరేజ్ చేయడానికి అవకాశం ఉంటుంది.
- ఈ స్ట్రక్చర్స్‌లో వరద నిండిన వెంటనే తొలగించేందుకు జీహెచ్ఎంసీ వీటి దగ్గర 25 హెచ్‌పీ కెపాసిటీ ఉన్న మీటర్లను బిగించింది.
- సంప్ నిండగానే నాలుగు గంటల్లోనే ఈ నీళ్లను ఖాళీ చేస్తున్నారు.
- మరిన్ని చోట్ల రెయిన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్‌ను నిర్మించాలని ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.
- రెండో దశలో వీటి నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. దీని కోసం వాటర్ లాగింగ్ సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తిస్తున్నారు.
- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఫిలింనగర్, శ్రీనగర్‌కాలనీ, శ్రీకృష్ణానగర్, సోమాజీగూడ, పంజగుట్ట తదితర ప్రాంతాల్లో కూడా వరదనీటి సంపుల నిర్మాణం చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.